సాక్షి జోగులాంబ గద్వాల

శనివారం ; 28 ; జూన్ ; 2025



.. పనుల్లో జాప్యమెందుకు?

గోకారం, ఎస్‌ఎల్‌బీసీని ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ శుక్రవారం పరిశీలించారు.

వివరాలు 7లో ▸



పవర్.. ఫుల్

జూరాల ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి పరుగులు పెడుతోంది.

వివరాలు 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35.6 /16.2

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమై సాయంత్రం వేళ చిరుజల్లులు కురవచ్చు.

న్యూస్‌రీల్

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



గద్వాల క్రైం: శాంతి భద్రతల విషయంలో అప్రమత్తంగా ఉంటూ అనుమానాస్పద కేసులపై వేగంగా విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాల్సిందిగా ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో నేర సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. సమస్యలపై వచ్చే బాధితులకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలల్లో సంచలనంగా మారిన తేజేశ్వర్ మిస్సింగ్, హత్య కేసును జిల్లా పోలీసు శాఖ వారం రోజుల వ్యవధిలోనే ఛేదించి, నిందితులను న్యాయమూర్తి ముందు ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించడంపై రాష్ట్ర డీజీపీ అభినందించారన్నారు. జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక విచారణ చేపట్టాలన్నారు. అనుమతి లేకుండా ఇసుక, మట్టి, రేషన్ బియ్యం, నిషేధిత మత్తు పదార్థాలు, గంజాయి, పేకాట వంటివిని కట్టడి చేయాలన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో పటిష్టమైన నిఘా మరింత పటిష్టం చేయాలని, సిబ్బందిపై వస్తున్న ఫిర్యాదులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు. స్టేషన్ పరిధిలో సిబ్బంది ఎవరైన ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసిన అనర్హత వేటు తప్పదన్నారు. నమోదైన కేసుల విషయంలో నిర్లక్ష్యం లేకుండా వీలైనంత త్వరగా కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేసి నిందితులకు శిక్ష పడేలా వ్యవహరించాలన్నారు. అనంతరం ఆయా స్టేషన్‌లో నమోదైన కేసులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నా రు. అదేవిధంగా డ్రగ్ రహిత సమాజ స్థాపన లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాల్సిందిగా ఎస్పీ పిలుపునిచ్చారు. సమావేశంలో డీఎస్పీ మొగిలయ్య, సీఐ టాటాబాబు, శ్రీను, రవిబాబు, ఎస్‌ఐ లు, కళ్యాణ్‌కుమార్, శ్రీకాంత్, వేంకటేష్, శ్రీనివాసు లు, మల్లేష్, శ్రీహరి, నందికర్ ఉన్నారు.

మున్సిపల్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ



అలంపూర్: అలంపూర్ మున్సిపల్ కమిషనర్‌గా శ్రీరాములు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న ఆయన పదోన్నతిపై కమిషనర్‌గా ఇక్కడికి వచ్చారు. కమిషనర్‌ను మున్సిపల్ అధికారులు, సిబ్బంది శాలువాతో సత్కరించారు. అదేవిధంగా నూతన కమిషనర్‌ను మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ భర్త వెంకటేష్, టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్, ఉపాధ్యాయ సంఘం సీనియర్ నాయకులు మద్దిలేటి స్వామి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సామేల్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు జూరాలకు మంత్రి ఉత్తమ్ రాక

గద్వాల: జూరాల ప్రాజెక్టు సందర్శన నిమిత్తం రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శనివారం రానున్నారు. జూరాల ప్రాజెక్టు గేట్లకు సంబంధించిన ఇనుప రోప్‌ల తాళ్లు తెగిపోయిన వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. దీనిపై శుక్రవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జూరాల ప్రాజెక్టు స్థితిగతులను క్షేత్ర స్థాయిలో తెలుసుకునేందుకు మంత్రి పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఇరిగేషన్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. అదేవిధంగా ఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీస్‌బందోబస్తును ఏర్పాటు చేయనున్నారు.

5న సాగునీటి సమస్యపై సదస్సు

పాలమూరు: పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాకు సంబంధించిన సాగునీరు సమస్యలపై జూలై 5న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు సంబంధించిన కరపత్రాలను శనివారం మహబూబ్‌నగర్‌లోని టీఎఫ్‌టీయూ కార్యాలయంలో ఆవిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో 40 లక్షల ఎకరాల సాగు యోగ్యమైన భూమి ఉందని తెలిపారు. కానీ కృష్ణా, తుంగభద్ర లాంటి జీవ నదులు ఉన్న కావాల్సిన నీరు లేక చాలా వరకు భూములు బీడుగా మారుతున్నాయని, ఇప్పటికీ పాలమూరులో వలసలు తగ్గడం లేదని వాపోయారు.

ఆయన రూటే సపరేటు

సివిల్ సప్లయ్ శాఖలో ఓ అధికారి దందాల పర్వం

- ఇటీవల రెండు మిల్లులకు కెపాసిటీకి మించి ధాన్యం కేటాయింపులు
- కార్యాలయానికి ఎప్పుడు వెళ్లినా ఖాళీ కుర్చీనే దర్శనం
- ఉన్నతాధికారులకు తెలిసినా చర్యలు శూన్యం



సివిల్ సప్లయ్‌శాఖలో శుక్రవారం ఉదయం 11:37 గంటలకు ముఖ్యఅధికారి గదిలో ఖాళీగా దర్శనమిచ్చిన కుర్చీ

గద్వాల: సివిల్‌సప్లయ్ శాఖలో ఓ ముఖ్యఅధికారి రూటే సప'రేటు'. సదరు అధికారి జిల్లాకు వచ్చి ఏడాది కాలం గడచినా ఇప్పటివరకు ఆఫీసుకు వచ్చింది.. కుర్చీలో కూర్చున్నది తక్కువే. కార్యాలయానికి రాకుండానే అన్ని దందాలు చక్కపెట్టేస్తాడు. అడిగిన 'రేటు' కడితే నిబంధనలను తుంగలో తొక్కేసి పనులు చేసిపెడతాడు. ఈ క్రమంలోనే జిల్లాలో రెండు రైస్ మిల్లులకు కెపాసిటీకి మించి ధాన్యం కేటాయింపులు చేయగా ఫలితంగా రూ.7 లక్షలు జేబులో వేసుకున్నట్లు బాహటంగానే ఆరోపణలు వినవస్తున్నాయి. ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు మాత్రం తెలిసీ తెలియనట్లు వ్యవహరిస్తూ.. చర్యలకు వెనకంజ వేయడం జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది.

59 వేల మెట్రిక్ టన్నులు కేటాయింపు

రబీలో ధాన్యం దిగుబడులు అధికంగా ఉన్న నేపథ్యంలో గతం కంటే ఈసారి రికార్డు స్థాయిలో 90 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల వద్ద మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఇందులో జిల్లాలోని 37 రైస్ మిల్లర్లకు 59,507.760 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కేటాయించింది. అయితే ఇప్పటి వరకు అన్ని రైస్ మిల్లర్ల నుంచి సీఎమ్మార్ రైస్ రూపంలో కేవలం 15.43శాతం మాత్రమే బియ్యాన్ని తిరిగి అందించారు. వాస్తవానికి ధాన్యం కేటాయించిన అనంతరం సివిల్ సప్లయ్ శాఖ అధికారులు నిరంతరం రైస్‌మిల్లులలో తనిఖీలు నిర్వహిస్తూ లక్ష్యం మేర సీఎమ్మార్ బియ్యం అందించేలా చర్యలు తీసుకోవాలి. కానీ జిల్లాలో అలాంటిదేమి జరగడం లేదు. దీనిపై పూర్తి బాధ్యతలు నిర్వహించాల్సిన అధికారే చిక్కడు.. దొరకడు తరహాలో వ్యవహరిస్తుంటే ఇక రైస్‌మిల్లుల నుంచి సీఎమ్మార్ బియ్యం రావడం ఎలా సాధ్యపడుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నిబంధనలు తుంగలో తొక్కి..

వాస్తవానికి ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా సాగైన ధాన్యం దిగుబడులను దృష్టిలో ఉంచుకుని రైస్‌మిల్లుల సామర్థ్యం కంటే రెండింతలు ధాన్యం కేటాయించాలని సివిల్‌సప్లయ్ శాఖనుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. దీనినే సాకుగా చేసుకున్న సదరు అధికారి తనకు రేటు కట్టిన అయిజ, కేటీ దొడ్డి మండలాల్లోని రెండు మిల్లులకు నిబంధనలను తొక్కేసి అధికంగా ధాన్యం కేటాయింపులు చేశారు. అయిజలోని ఓ రైస్‌మిల్లు రెండు టన్నుల కెపాసిటీ ఉండగా దానిని 6 టన్నుల కెపాసిటీకి పెంచి 3 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం బస్తాలు కేటాయించాడు. రూ.3 లక్షలు రేటు కట్టి వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా కేటీదొడ్డి మండలంలోని ఓ నాయకుడి మిల్లుకు 6 టన్నుల కెపాసిటీ నుంచి 10 టన్నుల కెపాసిటీకి పెంచి 6 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం బస్తాలు కేటాయించాడు. ఇక్కడ కూడా రూ.4 లక్షల రేటు కట్టి వసూళ్లు చేసినట్లు బలమైన ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ఆఫీసు పనివేళల్లో టీ స్టాల్‌లో రైస్ మిల్లర్లతో మంతనాలు జరుపుతున్న సదరు ముఖ్య అధికారి

గతంలో రూ.100 కోట్ల ధాన్యం మాయం

గతంలో జిల్లాలో సుమారు రూ.100 కోట్ల విలువైన ధాన్యాన్ని కొందరు రైస్‌మిల్లర్లు మాయం చేసి ప్రభుత్వానికి టోకరా వేసిన ఘటన సంచలనం రేపగా.. దీనిపై రికవరీ చేయాల్సిన అధికారులు నోటీసులతో సరిపెడుతున్నారు. ఇప్పుడు కూడా అధికారుల ఉదాసీనత వ్యవహారంతో మరోసారి అదే తరహాలో మోసం జరిగే అవకాశాలు ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు మేలుకుని చర్యలు తీసుకుని సదరు అధికారిని గాడిలో పెట్టాల్సిన అవసరం ఉంది.

విచారించి చర్యలు చేపడతాం



సివిల్‌సప్లయ్ శాఖ నుంచి అన్ని రైస్‌మిల్లులకు ఉన్న సామర్థ్యానికి రెండింతలు ధాన్యం కేటాయించాలని ఉత్తర్వులు వచ్చాయి. ఆ మేరకు రైస్‌మిల్లులకు ధాన్యం కేటాయించడం జరిగింది. ఆరోపణలు వస్తున్న ఆ రెండు రైస్‌మిల్లుల్లో క్షేత్రస్థాయిలో తనిఖీ నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా ఉంటే చర్యలు తీసుకుంటాం. అధికారి వ్యవహార శైలిపై కూడా విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. **– లక్ష్మీనారాయణ, అదనపు కలెక్టర్**

సామాజిక భద్రతకు పింఛన్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల: పింఛన్లు ప్రజలకు సామాజిక భద్రతను కల్పిస్తాయన్న దృష్టితో వాటి అమలును మరింత సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీ సమావేశం హాల్‌లో చేయూత పథకంపై నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సామాజిక భద్రత ఫింఛన్ పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ఫింఛన్ అందించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నూతన ఫింఛన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. ప్రజావాణిలో పింఛన్‌పై ఎక్కువ ఫిర్యాదుల రావడంతో ఈ అంశంపై పూర్తిగా దృష్టిని సారించి, అన్ని సమస్యలు త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి మండలంలో కనీసం 20 అర్హులైన కుటుంబాలను గుర్తించి, వారికి నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. చనిపోయిన ఫింఛన్‌దారుల వివరాలు సేకరిస్తే, వారి స్థానంలో కుటుంబ సభ్యుల్లో అర్హులైన వారికి ఫింఛన్ మంజూరును పరిశీలిన జరిపి, ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలని, గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమైనదని, ప్రతి పథకంలో వారి భాగస్వామ్యం ఎంతో అవసరమని అన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం

ఇందిరమ్మ ఇళ్ల మార్క్‌అవుట్ నుంచి బేస్‌మెంట్ వరకు ప్రతి దశను వేగవంతంగా నాణ్యంగా పూర్తి చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, ప్రతి మంగళవారం చీఫ్ సెక్రటరీ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇళ్ల పురోగతిలో గత వారం జిల్లా స్థానం 30వ స్థానంలో ఉండగా, ప్రస్తుతం 15వ స్థానానికి చేరుకోవడం సంతోషకరమన్నారు. ఈ దశలో మంచి పురోగతి సాధించిన అధికారులను కలెక్టర్ అభినందించారు. ఇక ముందు కూడా సమన్వయంతో పని చేస్తూ ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు,రాష్ట్ర సెర్ప్ కార్యాలయ సోషల్ సెక్యూరిటీ ఫింఛన్ల పంపిణి సంచాలకులు గోపాలరావు, డీపీఓ నాగేంద్రం, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'నీతి ఆయోగ్' ర్యాంకింగ్‌లో గట్టుకు 5వ స్థానం

గట్టు: నీతి ఆయోగ్ డెల్టా ర్యాంకింగ్‌లో జిల్లాలోని గట్టు మండలం దేశ వ్యాప్తంగా 5వ స్థానం, జోన్-3లో 2వ స్థానం సాధించినట్లు కలెక్టర్ బీఎం సంతోష్ తెలిపారు. శుక్రవారం నీతి ఆయోగ్‌కు సంబంధించిన విషయాలను కలెక్టర్ వెల్లడించారు. నీతి ఆయోగ్ తాజాగా విడుదల చేసిన ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్ (ఏబీపీ)2024-25(జనవరి నుంచి మార్చి 2025) క్యూ4 డెల్టా ర్యాంకింగ్‌లో గట్టు బ్లాక్ దేశ వ్యాప్తంగా 500 బ్లాక్‌లలో 5వ స్థానం, జోన్-3లో 2వ స్థానం సాధించిందని తెలిపారు. ఈ ప్రగతికి గుర్తింపుగా త్వరలో నీతి ఆయోగ్ తరపున గట్టు బ్లాక్‌కు రూ.కోటి పురస్కారం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ ర్యాంకింగ్ నీతి ఆయోగ్ నిర్వహించిన వర్చువల్ కార్యక్రమంలో దేశ వ్యాప్తంగా 500 ఆస్పిరేషనల్ బ్లాక్‌లు పాల్గొన్న సందర్భంలో ప్రకటించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నీతి ఆయోగ్ ప్రధాన కార్యాలయంలో ప్రారంభమైన 'వాల్ ఆఫ్‌ఫేమ్'లో టాప్ ర్యాంక్ సాధించిన బ్లాక్‌ల విజయ గాధలు ప్రదర్శించబడుతున్నట్లు వివరించారు. ఆస్పిరేషనల్ బ్లాక్స్, డిస్ట్రిక్ ప్రోగ్రామ్ లు దేశాన్ని వికసిత్ భారత్ – 2047లక్ష్యం వైపు నడిపించేందుకు ఎలా పని చేస్తున్నాయో చూపిస్తుందన్నారు. ఈ ర్యాంకింగ్‌ను 5 ప్రధాన అంశాలకుగాను ఉన్న 39 కీలక పనితీరు సూచికలు (కేపీఐఎస్) ఆధారంగా నిర్ణయించబడినట్లు తెలిపారు. ఆరోగ్యం, పోషణ, విద్య, వ్యవసాయం అనుబంధసేవలు, ప్రాథమిక మౌలిక సదుపాయాలు, సామాజిక అభివృద్ధి అంశాలకు సంబంధించి 2024 అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికం నుంచి 2025 జనవరి-మార్చి త్రైమాసికం మధ్యలో గట్టు బ్లాక్ కంపోజింగ్ స్కోర్ 61.24 నుంచి 69.43కు పెరిగి,8.19 అభివృద్ధిని నమోదు చేసిందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ గట్టు మండల అధికారులు, విభాగాధిపతులు, ఫ్రంట్‌లైన్ వర్కర్లను అభినందించారు. ఇది అందరి సమష్టి కృషి ఫలితంగా సాధ్యమైందని తెలిపారు. 100 శాతం కేపీఐ లక్ష్య సాధనకు అందరూ అంకిత భావంతో పని చేస్తున్నట్లు కొనియాడారు.

బీఆర్‌ఎస్ నేతల మాటలు అర్థరహితం

నారాయణపేట: జూరాల డ్యాంపై బీఆర్‌ఎస్ నేతల మాటలు అర్థరహితమని.. సీఎం రేవంత్‌రెడ్డి తన గురువు గారికి నీళ్లు ఇవ్వాలనే జూరాల నుంచి దిగువకు నీటిని వదులుతున్నారని అనడం ఆశ్చర్యంగా ఉందని రాష్ట్ర మత్స్య, పాడి పరిశ్రమ, క్రీడాశాఖల మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం మక్తల్‌లోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడారు. కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ డ్యాం నుంచి నీరు వదిలితేనే జూరాలకు వస్తాయని.. ఇక్కడి నుంచి దిగువకు వదలడం మామూలేనని అన్నారు. దీనిపై బీఆర్‌ఎస్ నేతలు లేనిపోని విమర్శలు చేయడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. మరోవైపు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం 95 శాతం పూర్తయిందని.. మోటారు ఆన్‌చేస్తే నీరు వస్తాయని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మోటరు ఆన్‌చేసి నీరు ఏ కాల్వలో వదలాలో చెప్పాలన్నారు. మక్తల్ మాజీ ఎమ్మెల్యే రాజకీయ జీవితానికి జీవం పోసిందే కాంగ్రెస్ పార్టీ అని.. అధికారంలో లేకపోయినా అధికారం చెలాయించారని మంత్రి అన్నారు. రాజకీయ పబ్బం గడుపుకొనేందుకు లేనిపోని విమర్శలు చేస్తే సహించమన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో సంగంబండ రిజర్వాయర్ వద్ద ఉన్న ఒక బండను పగులగొట్టేందుకు చేతకాలేదని విమర్శించారు. తాను ఎమ్మెల్యే అయిన మూడు నెలల్లోనే రూ. 12కోట్ల నిధులు తీసుకొచ్చి రిజర్వాయర్ నిర్వాసితులకు పునరావాసం కల్పించడంతో పాటు రైతులకు పరిహారం అందించినట్లు తెలిపారు. దాదాపు 5,600 ఎకరాలకు సాగునీరు అందించిన ఘనత తమదేనని అన్నారు. జూరాల డ్యాం భద్రత, అభివృద్ధిపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని.. బీఆర్‌ఎస్ నేతలు డేట్, టైం, ప్లేస్ డిసైడ్ చేయాలని మంత్రి సవాల్ విసిరారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గణేశ్, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు ఎల్కోటి నారాయణరెడ్డి, కోళ్ల వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

బైక్ మెకానిక్ కోర్సులో ఉచిత శిక్షణ

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహకారంతో స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగ యువత కోసం బైక్ మెకానిక్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంఘం డైరెక్టర్ శ్రీనివాసులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న 19 నుంచి 45 మధ్య వయసు ఉన్న ప్రతి ఒక్కరూ అర్హులని పేర్కొన్నారు. బైక్ మెకానిక్ శిక్షణతో స్వయం ఉపాధి పొందవచ్చని, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవా లని సూచించారు. శిక్షణ కాలంలో ఉచిత వసతితో పాటు ఉచిత భోజనం కూడా ఉంటుందని, ఇతర వివరాల కోసం 95424 30607, 99633 69361 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సత్వర పరిష్కారానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలి



హత్యకు గురైన తేజేశ్వర్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల: కేసుల సత్వర పరిష్కారానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరినట్లు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన గద్వాల పట్టణంలో హత్యకు గురైన సర్వేయర్ తేజేశ్వర్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈసందర్భంగా తేజేశ్వర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జిల్లాలో ఇటీవలి కాలంలో నేరాలు పెరిగిపోతుండడం ఆందోళన కలిగించే పరిణమామన్నారు. ఇలాంటి ఘటనలు ప్రభుత్వ పరువు తీసే విధంగా ఉన్నాయని, మరోసారి జరుగకుండా ఉండాలంటే నేరస్తులకు త్వరితగతిన శిక్షలు పడేలా తీర్పులు రావాలని, అందుకోసం ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఎంతో అవసరమన్నారు. కేటి.దొడ్డి మండలం, గద్వాలపట్టణంలో జరిగిన రెండు కేసుల్లో నిందితులను పోలీసులు త్వరితగతిన పట్టుకోవడం అభినందనీయమన్నారు. అదేవిధంగా కోర్టులో దోషులకు శిక్షపడేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. కార్యక్రమంలో గడ్డంకృష్ణారెడ్డి, బండారి భాస్కర్, బాబర్, మురళి, కృష్ణ, రాజశేఖర్, వెంకటేష్; సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామన్‌పాడు కాల్వలకు సాగునీరు

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శుక్రవారం సముద్రమట్టానికి పైన 1,020 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు. జూరాల ఎడమ, కుడి కాల్వలకు 550 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా.. సమాంతర కాల్వకు నీటి సరఫరా లేదని చెప్పారు. ఇదిలా ఉండగా రామన్‌పాడు జలాశయం నుంచి ఎన్టీఆర్ కాల్వకు 705 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వలకు 45 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కులు వినియోగిస్తున్నట్లు వివరించారు.

స్నాతకోత్సవానికి వేళాయె

పీయూలో 4వ కాన్వకేషన్‌కు సిద్ధమవుతున్న అధికారులు

- హాజరుకావాలని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు ఆహ్వానం
- యూజీ, పీజీ, పీహెచ్‌డీ, ఫార్మలో మొత్తం 88 మందికి గోల్డ్‌మెడల్స్
- రూ.2 లక్షలు స్పాన్సర్ చేస్తే వారి పేరు మీద విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్ ఇచ్చే అవకాశం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ పరిధిలో 2023- 25 విద్యా సంవత్సరం వరకు వివిధ ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ, ఫార్మ వంటి కోర్సులు చదువుతూ అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్ ప్రదానం చేసే స్నాతకోత్సవానికి యూనివర్సిటీ అధికారులు సన్నద్ధమవుతున్నారు. అందులో భాగంగా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల జాబితాను సిద్ధం చేశారు. మొత్తం 88 మంది విద్యార్థులకు మెడల్స్ అందజేసేందుకు కసరత్తు చేస్తున్నారు. వీరితో పాటు కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు సైతం కాన్వకేషన్ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు అధికారులు విద్యార్థుల నుంచి దరఖాస్తులు సైతం స్వీకరించారు. గతేడాది చివరలో కూడా కాన్వకేషన్ నిర్వహించేందుకు అధికారులు కసరత్తు చేసినప్పటికీ కొన్ని కారణాలతో ఆగిపోయింది. ఈ క్రమంలోనే తాజాగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ మేరకు పీయూ వీసీ శ్రీనివాస్, రిజిస్ట్రార్ రమేష్‌బాబు గవర్నర్‌కు ఆహ్వానం అందించారు. ఈ క్రమంలో సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో గవర్నర్ ఇచ్చే తేదీల ఆధారంగా కార్యక్రమం నిర్వహించే అవకాశం ఉంది.

స్పాన్సర్లకు అవకాశం..

కాన్వకేషన్‌లో మెడల్స్ ఇచ్చేందుకు అధికారులు పూర్తిస్థాయిలో కసరత్తు చేస్తున్నారు. అయితే ఆసక్తి గలవారు స్పాన్సర్‌షిప్ చేస్తే వారి పేరు మీద కూడా మెడల్స్ ప్రదానం చేయనున్నారు. ఇందుకోసం వ్యక్తులు యూనివర్సిటీ పేరు మీద రూ.2 లక్షలు డిపాజిట్ చేస్తే కేవలం ఆ డబ్బుల మీద వచ్చే వడ్డీతో మాత్రమే మెడల్స్‌ను విద్యార్థులకు అందజేస్తారు. అందుకోసం ఆసక్తి గలవారు నేరుగా యూనివర్సిటీ అధికారులను సంప్రదించాల్సి ఉంటుంది.

మూడు గోల్డ్ మెడల్స్ చొప్పున

మొత్తం 2023, 2024, 2025 విద్యా సంవత్సరాలకు సంబంధించి మొత్తం 13 పీజీ కోర్సులు, ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ, బీ, ఎం ఫార్మసీ, ఇంటిగ్రేటెడ్ ఫార్మ, బీపెడ్, ఎంపెడ్, ఎంబీఏ, బీఈడీ వంటి కోర్సులు ఉండగా.. వీటితో పాటు డిగ్రీలో బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ వంటి కోర్సులు ఉన్నాయి. వీటిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మెడల్స్ అందజేయనున్నారు. వీటితోపాటు పీయూలో ఇటీవల పీహెచ్‌డీ పూర్తి చేసిన విద్యార్థులకు కూడా గోల్డ్ మెడల్స్ ఇవ్వనున్నారు.

ఘనంగా నిర్వహిస్తాం..



పీయూ 4వ కాన్వకేషన్ కార్యక్రమాన్ని సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో నిర్వహించేందుకు పెద్దఎత్తున కసరత్తు చేస్తున్నాం. కార్యక్రమానికి హాజరుకావాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు ఆహ్వానం అందించారు. ముఖ్యంగా గోల్డ్‌మెడల్స్ ఇచ్చేందుకు స్పాన్సర్లు ముందుకు వస్తే వారి పేరు మీద కూడా అందిస్తాం. ఇందు కోసం రూ.2 లక్షలు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. **– శ్రీనివాస్, పీయూ వీసీ**

88 మంది విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్



పీయూ పరిధిలో 2022-23, 2023-24, 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి యూనివర్సిటీ టాపర్‌లుగా నిలిచిన విద్యార్థులకు త్వరలో నిర్వహించే 4వ స్నాతకోత్సవ కార్యక్రమంలో గోల్డ్‌మెడల్స్ అందించనున్నట్లు పీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రవీణ పేర్కొన్నారు. ఇందులో ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్, సోషల్ సైన్స్, కామర్స్‌లో 21 మంది విద్యార్థులు, ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్‌లో 27 మంది, ఎంబీఏ, ఎంసీఏ, ఫార్మసీలో 14 మంది, ఫ్యాకల్టీ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో 9, యూజీ కోర్సులలో టాపర్స్‌లో 17 మంది గోల్డ్‌మెడల్స్ అందించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు గోల్డ్‌మెడల్స్ సాధించిన విద్యార్థుల జాబితాను సంబంధిత కళాశాలలకు పంపించామని, వాటిపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే నాలుగు రోజుల్లో తెలపవచ్చని పేర్కొన్నారు. **–ప్రవీణ, పీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్**

క్లుప్తంగా

బైక్ టైర్‌లో చీర చిక్కుకొని మహిళ మృతి


శ్రుతి (ఫైల్)

కల్వకుర్తి రూరల్: బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తూ.. ఐదు నిమిషాల్లో పట్టణంలోని ఇంటికి చేరుకునేవారు.. అంతలోనే చీరకొంగు బైక్ టైర్లో ఇరుక్కోవడంతో జరిగిన ప్రమాదంలో శ్రుతి(24) మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకున్నది. మండలంలోని తోటపల్లికి చెందిన శృతి తిమ్మరాశిపల్లికి చెందిన రవితో నాలుగేళ్ల కిందట ప్రేమవివాహం చేసుకున్నది. ఇద్దరు కుమారులు. గురువారం కొల్లాపూర్‌లోని బంధువుల ఇంట్లో నిర్వహించిన దినవారాలకు వెళ్లారు. సాయంత్రం కల్వకుర్తికి బైక్‌పై తిరుగు ప్రయాణమయ్యారు. పట్టణ సమీపంలోని గ్రీన్‌పార్క్ కాలనీ వద్ద బైక్ వెనకాల కూర్చున్న శృతి చీరకొంగు టైర్‌లో ఇరుక్కుపోయింది. దీంతో కింద పడిపోవడంతో తల వెనుక భాగంలో బలమైన గాయాలై అపస్మారక స్థితికి చేరుకుంది. వెంటనే మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స తీసుకుంటూ.. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు తుదిశ్వాస విడిచింది. బైక్‌పై ఉన్న భర్త రవి, పిల్లలకు ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోలేదు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మాధవరెడ్డి తెలిపారు.

రోడ్డుప్రమాదంలో మహిళ దుర్మరణం


మహిళ మృతదేహం

వెల్దండ: మండల కేంద్ర సమీపంలో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై యెన్నమ్స్ ఆస్పత్రి వద్ద శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందింది. ఎస్‌ఐ కురుమూర్తి కథనం ప్రకారం.. హైదరాబాద్-శ్రీశైలం ప్రధాన రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదం గుర్తు తెలియని మహిళ మృతిచెందినట్లు సమాచారం అందింది. ఘటనా స్థలాన్ని వెళ్లి పరిశీలించగా మృతి చెందిన మహిళ దాదాపుగా (38) ఏళ్ల వయస్సు కల్గి ఉంటుంది. ఆకుపచ్చ జాకెట్, పసుపు రంగులో చీర ధరించి ఉంది. మృతదేహాన్ని కల్వకుర్తి ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు వెల్దండ పోలీస్‌స్టేషన్ సమాచారం అందించాలని పేర్కొన్నారు.

యువతి అదృశ్యం: కేసు నమోదు

మద్దూరు: మద్దూరు మున్సిపల్ పరిధిలోని నాగంపల్లికి చెందిన అఖిల (18) గురువారం నుంచి అదృశ్యమైనట్లు ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపారు. దౌల్తాబాద్ మండలం మొగులమడ్కలోని అమ్మమ్మకు వెళ్తున్నానని చెప్పి వెళ్లిన యువతి తర్వాత ఇంటికి తిరిగిరాలేదు. ఈ క్రమంలో కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బైక్‌పై నుంచి పడి యువకుడి మృతి

మరికల్: బైక్‌పై నుంచి పడి యువకుడు మృతి చెందిన ఘటన మరికల్ సమీపంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాము వివరాల మేరకు.. కర్నూలు జిల్లా పెద్దకాబ్బూర్ మండలం ఉలికంది గ్రామానికి చెందిన మస్కి తిమ్మయ్య (36) బైక్‌పై హైదరాబాద్‌కు బయలుదేరాడు. మార్గమధ్యంలోని మరికల్ సమీపానికి రాగానే బైక్ అదుపుతప్పి కింద పడ్డాడు. ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఆరుగురు కుమార్తెలు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఏసీబీ అధికారుల హల్‌చల్


వార్డెన్‌తో వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

- అచ్చంపేట బీసీ హాస్టల్‌లో రికార్డులు, పరిసరాల పరిశీలన
- ప్రభుత్వానికి పూర్తి నివేదిక అందిస్తామన్న డీఎస్పీ


చింతపండు తూకం వేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్

అచ్చంపేట: స్థానిక బీసీ ప్రభుత్వ వసతిగృహాన్ని శుక్రవారం మహబూబ్‌నగర్ రేంజ్ డీఎస్పీ సీహెచ్ బాలకృష్ణ ఆధ్వర్యంలో ఆహార భద్రత, ఆరోగ్య, తూనికలు కొలతలు, విద్యుత్ శాఖలతో పాటు ఇతర శాఖల అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 7 వరకు హాస్టల్‌కు చేరుకున్న అధికారులు వార్డెన్ జనార్దన్ లేకపోవడంతో 10 గంటల వరకు నిరీక్షించారు. వార్డెన్, పదోన్నతిపై వెళ్లిన వార్డెన్ శ్రీరామ్ వచ్చిన అనంతరం ఆయా శాఖల అధికారులు కార్యాలయంలోని 18 రకాల రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన మెనూ, అరటి పండ్లు, సబ్బులు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలన చేశారు. పలువురు విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పరిసరాలు, భవనం పరిస్థితిని చూశారు. ఏసీబీ తనిఖీల సమాచారం క్షణాల్లో ప్రచారం కావడంతో అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి. ఏ కార్యాలయంపై దాడులు చేస్తారన్న భయంతో వణికిపోయారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు అప్రమత్తమై భయం, భయంగా విధులు నిర్వర్తించారు. ఈ నెల 25న కల్వకుర్తి ఎస్‌ఐ-2 ఎం.రాంచందర్‌జీ ఏసీబీకి పట్టుబడటం, మూడు రోజుల వ్యవధిలోనే అచ్చంపేటలో ఏసీబీ అధికారులు తనిఖీ చేపట్టడం చర్చనీయాంశమైంది.

ప్రభుత్వానికి నివేదిస్తాం..

రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వసతిగృహాల్లో ప్రభుత్వం ప్రకటించిన మెనూ అమలు, ఇతర సౌకర్యాలు పరిశీలించేందుకే తనిఖీలు చేపట్టామని ఏసీబీ డీఎస్పీ సీహెచ్ బాలకృష్ణ తెలిపారు. హాస్టల్‌లో విద్యార్థుల నమోదు, ప్రస్తుతం ఉన్న విద్యార్థుల సంఖ్య వివరాలను పరిశీలించినట్లు చెప్పారు. లోకల్, నాన్ లోకల్ విద్యార్థుల వివరాలు, హాస్టల్ భవనం పరిస్థితి, సౌకర్యాలు పరిశీలించామన్నారు. హాస్టల్ పరిసరాల పరిశుభ్రత, ఇతర సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నామని తెలిపారు. ప్రతి హాస్టల్‌లో 18 రకాల రికార్డులను నిర్వహిస్తారని.. వాటి ఆధారంగా గుర్తించిన అంశాలను సరి పోల్చుకొని పూర్తి వివరాల నివేదికను ఏసీబీ డీజీకి అందజేస్తామని చెప్పారు. డిటేల్ రిపోర్టు ప్రభుత్వానికి పంపించిన తర్వాత సంబంధిత అధికారులపై చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులకు సిఫారస్ చేస్తారన్నారు. తనిఖీల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నీలిమా, తూనికలు, కొలతల అధికారి ప్రవీణ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వజ్రకుమార్ రెడ్డి, ఏసీబీ సీఐలు ఎస్‌కేఏ జిలానీ, పి.లింగస్వామి, ట్రాన్స్‌కో ఏఈ రామకృష్ణ, వార్డెన్లు శ్రీరామ్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వాయర్ పనుల్లో జాప్యమెందుకు?


రిజర్వాయర్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ శివకుమార్ నాయుడు

వెల్దండ: పూర్వపు మండలంలోని ఎర్రవల్లి, గోకారం రెవెన్యూ పరిధిలో నిర్మిస్తున్న గోకారం రిజర్వాయర్ పనుల్లో జాప్యమెందుకు జరుగుతోందని రాష్ట్ర భూ నిర్వాసితుల పునరావాస కమిషనర్ శివకుమార్ నాయుడు ప్రశ్నించారు. శుక్రవారం ఆయన రిజర్వాయర్‌ను సందర్శించి అధికారులతో మాట్లాడి భూములు కోల్పోతున్న రైతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్వాసితులకు అందిన పరిహారం, బకాయిల వివరాలు అధికారులు కమిషనర్‌కు వివరించారు. పనుల్లో వేగం పెంచాలని.. బకాయి పరిహారం వెంటనే చెల్లించాలని సూచించారు. వెంటనే పనులు ప్రారంభించేందుకు కాంట్రాక్టర్లు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ అమరేందర్, నీటిపారుదలశాఖ ఈఈ కుమార్, వెల్దండ, చారగొండ తహసీల్దార్లు కార్తీక్ కుమార్, సునీత, సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, కాంట్రాక్టర్లు, ఇతర సిబ్బంది ఉన్నారు.

ఎస్‌ఎల్‌బీసీ, డీబీఆర్ ప్రాజెక్టుల పరిశీలన..

అచ్చంపేట రూరల్: మండలంలోని మన్నెవారిపల్లి సమీపంలోని ఎస్‌ఎల్‌బీసీ, నక్కలగండి డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లను శుక్రవారం ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ శివకుమార్‌నాయుడు, అడిషనల్ కలెక్టర్ అమరేందర్ బృందం పరిశీలించింది. ఎల్ఎల్‌బీసీ సొరంగంలో కొనసాగుతున్న, చేపట్టాల్సిన పనుల వివరాలను అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కాగా అక్కడి భూ నిర్వాసితులతో ముఖాముఖీ ఉన్నప్పటికీ కేవలం ప్రాజెక్టులను మాత్రమే పరిశీలించి వెళ్లడంతో భూ నిర్వాసితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేశ్యతండా, మార్లపాడుతండాలో స్థానిక రెవెన్యూ అధికారులు ఏర్పాట్లు చేసినప్పటికీ అధికారులు అర్ధాంతరంగా వెళ్లిపోయారని వివరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యటనలు చేస్తున్నారే తప్ప సమస్యలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

పనిచేయించుకున్నారు.. పోస్టు లేదు పొమ్మన్నారు!

- న్యాయం చేయాలంటూ కేజీబీవీ వంటమనిషి వేడుకోలు
- కనీసం పనిచేసిన ఐదు నెలల జీతం ఇవ్వాలని మొర


బాధితురాలు శశికళ

గండేడ్: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం ప్రారంభం నుంచి ఓ మహిళతో పనిచేయించుకున్నారు. తీరా ఐదు నెలలు గడిచిన తర్వాత పోస్టు లేదు.. వెళ్లి పొమ్మన్నారు. జీతం అడిగితే తమకు తెలియదంటూ దాటవేస్తున్నారు. తనకు న్యాయం చేయాలంటూ బాధిత మహిళ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతోంది. వివరాల్లోకి వెళ్తే.. మహమ్మదాబాద్‌కు చెందిన శశికళ గత జనవరిలో గండేడ్‌లో కొత్తగా ఏర్పాటైన కేజీబీవీలో వంటమనిషిగా చేరారు. అప్పట్లో ప్రజాప్రతినిధుల సిఫారసు మేరకు వర్కర్లను నియమించారు. అయితే అప్పటి నుంచి శశికళ పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరవుతూ వంట చేసేది. ఈ క్రమంలోనే వేసవి సెలవులు వచ్చాయి. విద్యార్థినులు ఇళ్లకు వెళ్లిపోయినా వర్కర్లు పాఠశాలకు రెగ్యులర్‌గా రావాలని చెప్పడంతో మిగతా వారితో పాటు శశికళ నిత్యం మహమ్మదాబాద్ నుంచి విధులకు హాజరయ్యేది. పాఠశాల పునఃప్రారంభమైన తర్వాత కూడా యథావిధిగా విధులకు హాజరై విద్యార్థులకు వంటావార్పు చేస్తూ వచ్చింది. అయితే ఈ నెల 17 తర్వాత ఎస్‌ఓ శివలీల వర్కర్ల జాబితాలో నీ పేరు లేదు.. రావొద్దని శశికళకు చెప్పడంతో ఖంగుతింది. ఇన్ని రోజులు పనిచేయించుకొని ఇలా చెప్పడం ఏంటని ఆమె ప్రశ్నించగా.. ఈ విషయంలో తనకు ఎలాంటి సంబంధం లేదని.. మీరు రావాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పారు. అయితే తాను పనిచేసిన ఐదు నెలల జీతమైనా ఇవ్వాలని అడిగితే తమకు సంబంధం లేదని చెబుతున్నారని బాధితురాలు ఆవేదన వ్యక్తంచేశారు. బయట పని చేసుకున్నా కనీసం ఇల్లు గడిచేదని వాపోయారు. ఈ విషయమై శశికల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో ఎంఈఓను విచారణకు ఆదేశించారు. ఎలాగైనా తనకు న్యాయం చేయాలని బాధితురాలు వేడుకుంటోంది.

ఎస్‌ఓకే తెలియాలి..

శశికళ నియామకం సంగతి మాకు తెలియదు. అన్ని రోజులుగా కేజీబీవీలో సదరు కార్మికురాలు పనిచేసింది. ఒకవేళ ఆమె పోస్టు లేనప్పుడుడు ఆమెతో పనిచేయించుకోకుండా ఉండాల్సింది. డీఈఓకు పంపిన లిస్టులో శశికళ పేరు లేదు. ఆ విషయం ఎస్‌ఓకే తెలియాలి. –జనార్దన్, ఎంఈఓ, గండేడ్

వర్కర్ల జాబితా డిఈఓకు పంపించా..

పాఠశాల ప్రారంభంలో ప్రజాప్రతినిధుల సిఫారసు మేరకు వర్కర్లు పనిచేశారు. పోస్టులు వస్తాయని చెప్పారు. సంఖ్య తక్కువగా ఉంది. ఎనిమిది మందికి మాత్రమే అవకాశం ఉంది. వారితో పాటు శశికళ పేరు కూడా డీఈఓకు పంపాను. – శివలీల, కేజీబీవీ ఎస్‌ఓ, గండేడ్

'రాచాల' వాహనంపై దాడి


ధ్వంసమైన కారు అద్దం

కొత్తకోట రూరల్: బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ వాహనంపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసిన ఘటన గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఆనంద్ కథనం మేరకు.. యుగంధర్‌గౌడ్ వనపర్తి నుంచి స్వగ్రామం కొత్తకోట మండలం వడ్డెవాటకు తన కారులో వెళ్తుండగా గ్రామ సమీపంలోని భీమా ఫేస్-2 కాల్వ సమీపంలో గుర్తు తెలియని నలుగురు వ్యక్తులు రెండు బైక్‌లపై వచ్చిన వాహనాన్ని అడ్డగించారు. కారు డ్రైవర్ రాజు చాకచక్యంగా వ్యవహరించడంతో దుండగులు అద్దాలు ధ్వంసం చేసి పారిపోయినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. దాడికి పాల్పడిన వ్యక్తులను గుర్తించి తనకు రక్షణ కల్పించాలని యుగంధర్‌గౌడ్ కోరారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి



కల్వకుర్తి రోడ్డు: మండలంలోని కురుమిద్దలో శుక్రవారం విద్యుత్ షాక్ తగిలి పాడిఆవు మృతిచెందింది. గ్రామానికి చెందిన కాలె మల్లయ్యకు చెందిన ఆవు వ్యవసాయ పొలంలో మేత మేస్తున్న క్రమంలో సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగ తగిలి అక్కడిక్కడే చనిపోయింది. దాదాపు రూ 1,20,000 నష్టం వాటిల్లిందని, తనను ఆదుకోవాలని రైతు మల్లయ్య కోరారు.

రాష్ట్రస్థాయి టోర్నీలో చాంపియన్‌గా నిలవాలి


జిల్లా బాలుర ఫుట్‌బాల్ జట్టుతో ఎన్‌పీ వెంకటేశ్, డీవైఎస్‌ఓ శ్రీనివాస్

- ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్‌పీ.వెంకటేశ్
- నిజామాబాద్ తరలిన బాలుర ఫుట్‌బాల్ జట్టు

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నీలో జిల్లా జట్టు మెరుగైన ప్రతిభ కనబరిచి చాంపియన్‌గా నిలవాలని ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్‌పీ.వెంకటేశ్ అన్నారు. నిజామాబాద్‌లో నేటి (శనివారం) నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి బాలుర జూనియర్ ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొనే జిల్లా జట్టు శుక్రవారం తరలి వెళ్లింది. ఈసందర్భంగా జిల్లా జట్టును స్థానిక మెయిన్ స్టేడియంలో ఎన్‌పీ వెంకటేశ్ అభినందించారు. ఫుట్‌బాల్‌లో జిల్లాలో క్రీడాకారులకు కొదువ లేదన్నారు. జిల్లా క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. నిరంతర ప్రాక్టీస్‌తో క్రీడల్లో ఉన్నత స్థానాల్లో చేరుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్యాట్రన్ రంగారావు, ప్రధాన కార్యదర్శి భానుకిరణ్, కోశాధికారి కేఏస్.నాగేశ్వర్, కార్యనిర్వాహక కార్యదర్శి ఇమ్మాన్యుయేల్ జేమ్స్, సభ్యులు నందకిషోర్, సూర్యప్రకాశ్, రాజేందర్, ఖేలో ఇండియా మహబూబ్‌నగర్ ఫుట్‌బాల్ కోచ్ నికేష్ పాల్గొన్నారు.

జిల్లా జూనియర్ ఫుట్‌బాల్ జట్టు: కల్మూరి వంశీకృష్ణ, కొండపల్లి అభిరాం, కొండపల్లి సాయితేజ, జి.వంశీకృష్ణ, జర్పలావత్ ధ్యానవర్ధన్ నాయక్, మహ్మద్ అమాన్, జె.శివ, ఎం.రాఘవేందర్, బండి నవతేజ్, ఎండీ సుభాన్, ఎల్.కృపదాస్, కాట్రావత్ చరణ్, మహ్మద్ మజైన్ సదిమ్, మహ్మద్ ఖాజామైనద్దీన్, ఎం.చరణ్, మహ్మద్ అబ్దుల్ మతిన్, ఎండీ అక్బార్ షరీఫ్, అనస్ తార.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

తిమ్మాజీపేట: మేలకుంటలో పడి అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన సంఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మెంట అంజనమ్మ(65)కు ముగ్గురు కుమారులు ఉన్నారు. రెండో కుమారుడు భార్య వల్ల కుటుంబంలో గొడవలు చోటుచేసుకున్నాయి. ఈనెల 23న అంజనమ్మ ఇంటికి పంచాయతీ నిర్వహించేందుకు కోడలి తరుపు బంధువులు పోతిరెడ్డిపల్లికి వచ్చారు. 24 నుంచి అంజనమ్మ ఇంటి నుంచి వెళ్లిపోయి, ఆచూకీ లభించలేదు. శుక్రవారం ఉదయం కాలకృత్యాలకు వెళ్లిన కుమారుడికి మేలకుంటలో అంజనమ్మ మృతదేహం కనిపించింది. రెండో కోడలు తరుపు బంధువులు అంజనమ్మను దూషించడం వల్లనే మనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు పెద్ద కుమారుడు మెంట వెంకటేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు.

ఒడిశా టు పాలమూరు.. గంజాయి సరఫరా

400 గ్రాముల ఎండు గంజాయి సీజ్


ఎక్సైజ్ పోలీసుల అదుపులో యువకులు

మహబూబ్‌నగర్ క్రైం: ఒడిశా నుంచి పాలమూరుకు గంజాయి సరఫరా అవుతోంది. శుక్రవారం ఎక్సైజ్ పోలీసుల తనిఖీల్లో గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులు పట్టుబడ్డారు. ఎక్సైజ్ పోలీసుల వివరాల మేరకు.. ఎక్సైజ్ సీఐ వీరారెడ్డి, సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మయూరీ పార్క్ సమీపంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో సంతోష్‌కుమార్‌గౌడ్, రూడావత్ రవికాంత్ అనే ఇద్దరు యువకులు వంద గ్రాముల ఎండు గంజాయితో బైక్‌పై వెళ్తుండగా పట్టుకున్నారు. అయితే సదరు యువకులను పోలీసులు విచారించగా.. నక్కలబండ ప్రాంతంలో ఒడిశాకు చెందిన చందన్ మహంత అనే వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. దీంతో నక్కలబండ ప్రాంతానికి ఎక్సైజ్ పోలీసులు వెళ్లి తనిఖీలు చేపట్టగా.. సదరు వ్యక్తి వద్ద మరో 300 గ్రాముల ఎండు గంజాయి లభ్యమైంది. నక్కలబండ వద్ద చేపట్టిన టన్నెల్ నిర్మాణంలో చందన్ మహంత రోజు కూలీగా పని చేయడంతో పాటు ఒడిశా నుంచి ఎండు గంజాయి తీసుకొచ్చి ఇద్దరు వ్యక్తుల ద్వారా జిల్లా కేంద్రంలో విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందని సీఐ తెలిపారు. మొత్తం 400 గ్రాముల ఎండు గంజాయి, ఒక ద్విచక్ర వాహనం, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా.. రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

పచ్చిరొట్ట.. ప్రయోజనాలెన్నో!

- భూమి సారం, పంటలకు సంపూర్ణ ఆరోగ్యం
- సూక్ష్మజీవుల వృద్ధి, చీడపీడల నియంత్రణ
- అధిక దిగుబడి సాధించేందుకు అనుకూలం


గత వర్షాకాలంలో సాగు చేసిన జీలుగ పంట

చిన్నచింతకుంట: అధిక దిగుబడులే లక్ష్యంగా రైతులు పంటసాగులో విచ్చలవిడిగా రసాయన ఎరువులు వినియోగిస్తున్నారు. దీంతో భూసారం దెబ్బతినడమే కాకుండ ఆహార పంటలు కలుషితమవుతున్నాయి. క్రమంగా పంటలో సూక్ష్మ స్థూల పోషకాలు లోపిస్తున్నాయి. అంతేకాక చీడపురుగుల ఉధృతి పెరుగడంతో రైతుకు పెట్టుబడుల భారం పెరుగుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో పచ్చిరొట్ట ప్రత్యామ్నాయంగా కనిపిస్తుంది. జీలుగ, జనుము, పెసర, పిల్లిపెసర, అలసంద వంటివి సాగు చేసుకొని అధిక దిగుబడులు సాధించుకోవచ్చు. రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను వినియోగించుకోకుంటే భవిష్యత్‌లో భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేతలు హెచ్చరిస్తున్నారు.

ప్రధానంగా 16రకాలు

పచ్చిరొట్ట సాగులో ప్రధానంగా 16రకాలు ఉండగా ఎక్కువగా రైతులు జీలుగ, జనుము, పెసర, పిల్లిపెసర వంటివి సాగు చేస్తారు. ఇది స్థూల సేంద్రియ ఎరువుగా తయారవుతోంది. ఇది నేలకు సేంద్రియ ఎరువుతోపాటు నత్రజనిని అందిస్తుంది. వీటిని మొగ్గ దశవరకు పెంచి భూమిలో కలియ దున్నుతారు. ఈ మొక్కలు లెగ్యుం జాతికి చెందినవి. వీటి ఏర్లలోని గుడిపెలు నత్రజనిని స్వీకరించి మళ్లీ సాగు చేసిన పంట మొక్కకు అందేలా తోడ్పడుతాయి. పచ్చరొట్ట పైర్లు పూత దశకు రావడానికి 40లేదా 50రోజుల సమయం పడుతుంది. ఇది కుళ్లే సమయంలో కొన్ని రకాల వాయువులు తయారవుతాయి. వాటి వల్ల నాటిన మొక్కకు హాని కల్గిస్తుంది. కాబట్టి పచ్చిరొట్ట కలియ దున్నిన రెండు వారాలకు మొక్కను నాటుకోవాలి.

పచ్చిరొట్టతో లాభాలు

పచ్చిరొట్ట ప్రధానంగా వరి పంటకు ముందస్తుగా సాగు చేసుకోవాలి. ఇది నేల సారవంతంగా తయారు చేస్తుంది. నేల భౌతిక స్థితిని మెరుగుపరిచి భూమిని గుల్లగా మారుస్తాయి. నేలలో నీరు ఇంకే గుణాని పెంచుతాయి. నేల కోతకు గురికాకుండా కాపాడుతాయి. పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులను వృద్ధి చేస్తాయి. జీవ రసాయనిక చర్యలతో నేలసారం పెరగడంతోపాటు పంటలు సంపూర్ణ ఆరోగ్యాన్ని సంతరించుకుంటాయి. సూక్ష్మజీవులు ఉత్పత్తి చేసే హార్మోన్లతో మొక్కల పెరుగుదల వృద్ధి చెందుతుంది. పంటల నాణ్యత కూడా పెరుగుతుంది. చౌడు భూముల పునరుద్ధరణకు ఉపయోగపడుతాయి. పంట మార్పిడికి సహాయపడుతాయి. పురుగులు, తెగుళ్ల బెడదను తగ్గించి సస్యరక్షణ ఖర్చును కూడా నియంత్రిస్తాయి.

సాగువిధానం..

ప్రధానంగా వరిసాగు చేసే రైతులు దీన్ని సాగు చేసుకుంటారు. వరి నారుమడులకు ముందే పచ్చిరొట్టను సాగు చేసుకోవాలి. మే, జూన్‌నెలలో సాగుకు అనుకూలంగా ఉంటుంది. ముందుగా దుక్కిని దున్ని విత్తనాలను చల్లుకోవాలి. జీలుగ విత్తనాలు ఎకరాకు 12కిలోలు, జనుము 15, పెసర 8, పల్లి పెసర 10, అలసంద 12 కిలోల విత్తనాలను చల్లుకోవాలి.

అధిక దిగుబడులు వస్తాయి



పచ్చిరొట్ట సాగుతో భూమి సారవంతంగా అవుతుంది. సాగుచేసిన పంటలకు సేంద్రియ ఎరువులతోపాటు నత్రజని అందిస్తుంది. పంటలు సంపూర్ణ ఆరోగ్యంగా ఎదిగి అధిక దిగుబడులు వస్తాయి. రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించి తప్పనిసరిగా పచ్చిరొట్ట సాగును చేసుకోవాలి. – రాజేశ్ ఖన్నా, ఏఓ, చిన్నచింతకుంట

కేఎల్ఐ కాల్వలో జమ్ముతో ఇబ్బందులు


సాతాపూర్ వద్ద కేఎల్ఐ కాల్వలో పేరుకపోయిన జమ్ము

పెద్దకొత్తపల్లి: మండలంలోని కేఎల్ఐ కాల్వలో జమ్ము ఏపుగా పెరగడంతో సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జొన్నలబొగుడ రిజర్వాయర్ నుంచి డీ-38 కాల్వ జొన్నలబొగుడ, సాతాపూర్, కొత్తపేట, చెన్నపురావుపల్లి, గంట్రావుపల్లి, కల్వకోలుకు సాగునీరు అందించే కాల్వలో జమ్ము ఏపుగా పెరిగి కాల్వలో నీరు నిల్వ ఉండి రైతుల పొలాలపై పారుతున్నాయి. వేసవిలో ఈ కాల్వలో సాగునీరు వదలడంతో ఉపాధి హామీ పథకంలో ఈ కాల్వలను శుభ్రం చేయలేదు. మిగతా కాల్వలను ఉపాధి హామీ సిబ్బంది జమ్ము తొలగించారు. ఇరిగేషన్ అధికారులు పట్టించుకొని కాల్వలో పేరుకుపోయిన జమ్మును జేసీబీల ద్వారా తొలగించాలని రైతులు పరశురాము, వీరయ్య కోరారు.

90 ట్రాక్టర్ల ఇసుక మాయం


ఫిబ్రవరిలో సీజ్ చేసిన 90 ట్రిప్పుల ఇసుక

బిజినేపల్లి: మండలంలోని మమ్మాయిపల్లిలో ఫిబ్రవరిలో 90 ట్రాక్టర్ల ఇసుకను గత తహసీల్దారు శ్రీరాములు సీజ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవడానికి ఇసుక కోసం లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరుతున్నారు. మండలంలో ప్రస్తుతం ఇసుక లేదని, ఉంటే అనుమతులు ఇచ్చేవాళ్లని అధికారులు చెప్పుకొచ్చారు. మమ్మాయిపల్లిలో సీజ్‌చేసిన 90 ట్రాక్టర్ల ఇసుక ఉండి ఉంటే స్థానిక గ్రామాల లబ్ధిదారులకు ఇక్కట్లు తప్పేవని అంటున్నారు. ఈ విషయమై తహసీల్దారు ఎండీ మున్నీరుద్దిన్ వివరణ కోరగా.. సీజ్ చేసిన ఇసుకను పోలీస్‌శాఖకు అప్పగించామని, తమకేమీ సంబంధం లేదన్నారు.

భారీగా మట్టి డంప్


మట్టి నిల్వలను పరిశీలిస్తున్న సీఐ కమలాకర్

జడ్చర్ల: మండలంలోని పోలేపల్లి సెజ్ శివారులో భారీగా నిల్వచేసిన మట్టిని శుక్రవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దాదాపు వంద టిప్పర్ల మట్టిని రహస్యంగా రాజాపూర్ మండలంలోని వాగు నుంచి ఇక్కడికి తరలించినట్లుగా అనుమానిస్తున్నారు. ఈ మట్టిని ఫిల్టర్‌చేసి ఇసుక తయారు చేసేందుకు వినియోగిస్తారని తెలిపారు.స్థానిక సీఐ కమలాకర్ మట్టి డంప్‌ను పరిశీలించి.. స్థానిక తహసీల్దార్ నర్సింగరావుకు సమాచారం ఇచ్చారు. మట్టి డంప్‌ను వేలం వేసి ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూరుస్తామని తహసీల్దార్ తెలిపారు. కాగా, ఇక్కడికి మట్టి తరలించిన వారే తక్కువ ధరకు ఇసుకను వేలంలో దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.